సాక్షి
కామారెడ్డి
గురువారం। 15। ఫిబ్రవరి। 2024



ఘనంగా వసంత పంచమి

జిల్లాలో వసంత పంచమిని ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాలలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

- 9లో ▸



వరిని వదలని మొగి

వరి పంటను చీడపీడలు పట్టి పీడిస్తున్నాయి. మొగి పురుగుతో పంట దెబ్బతింటుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.8 /17.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బీజేఎల్పీ ఉపనేతగా కేవీఆర్



సాక్షి, కామారెడ్డి: బీజేపీ శాసన సభాపక్ష ఉపనేతగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించి చరిత్ర సృష్టించిన కేవీ ఆర్‌ను శాసనసభాపక్ష నేతగా నియమిస్తారని అందరూ భావించారు. అయితే ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినందున ఉపనేత పదవితో సరిపెట్టారని తెలుస్తోంది.

కామారెడ్డి బల్దియా కమిషనర్‌గా సుజాత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా కమిషనర్‌గా కె.సుజాత నియమితులయ్యారు. ఆమె ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ పనిచేసిన దేవేందర్‌ను రామాయంపేటకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఎల్లారెడ్డి బల్దియాకు కమిషనర్‌ను నియమించాల్సి ఉంది.

బాన్సువాడ కమిషనర్‌గా అలీం

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ రమేశ్ దుబ్బాకకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామగుండం కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేసిన అలీం బాన్సువాడకు వస్తున్నారు.

కామారెడ్డి డీఎస్పీ బదిలీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డి డీఎస్పీ ఆర్.ప్రకాశ్ మంచిర్యాల ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాష్ట్ర పోలీసు శాఖ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో పనిచేస్తున్న డాక్టర్ డి. రాజేశ్వర్ రానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం విడుదలయ్యాయి.

కలెక్టరేట్ ఉద్యోగినంటూ మోసాలు

● ఒకరిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఉద్యోగినంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పెద్దబజార్ ప్రాంతానికి చెందిన మంగలి రాములుకు ఈనెల 6న ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. తన పేరు విజయ్ కుమార్ అని, ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తున్నానని నమ్మించాడు. చాలామందికి దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, బీసీ బంధు ఇప్పించానని చెప్పాడు. ఇల్లు, బీసీ బంధు ఇప్పిస్తానని నమ్మించి రాములు వద్ద నుంచి విడతలవారీగా రూ.39 వేలు వసూలు చేశాడు. తర్వాత ఎన్నిసార్లు అడిగినా స్పందించకపోవడంతో రాములు పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు ఉద్యోగి కాదని, అమాయకులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. రాములు ఫిర్యాదు మేరకు గుర్రపు విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పుంజుకోని రియల్ రంగం!

కరోనాతో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం..

తర్వాత కొంత మెరుగుపడినా పూర్వవైభవం మాత్రం రావడం లేదు. ప్లాట్ల ధరలు అడ్డగోలుగా పెరగడంతో సామాన్యులు ఇంటి స్థలం కొనలేని పరిస్థితి ఉంది. దీంతో కొనుగోళ్లు, అమ్మకాలు మందగించి వ్యాపారులతోపాటు మధ్యవర్తులూ ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో సర్కారు ఆదాయమూ గణనీయంగా పడిపోయింది.

గణనీయంగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

- పడిపోయిన సర్కారు ఆదాయం
- ధరలు పెరగడంతో సామాన్యులు ప్లాట్లు కొనలేని పరిస్థితి
- దందా నడవక ఇబ్బందుల్లో వ్యాపారులు, మధ్యవర్తులు

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూముల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. కామారెడ్డి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటయ్యాక ప్లాట్ల ధరలకు రెక్కలొచ్చి ఆకాశాన్నంటాయి. కామారెడ్డి పట్టణ పరిధిలోని ప్లాట్ల ధరలు ఏకంగా హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలోని ధరలతో పోటీ పడ్డాయి. రెండు, మూడేళ్ల పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు వెంచర్లు, ఆరు ప్లాట్లు అన్నట్లుగా జోరుగా సాగింది. అయితే కరోనా మూలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా తగ్గిపోయాయి. కరోనా వ్యాప్తి తగ్గిపోయాక అమ్మకాలు, కొనుగోళ్లలో కొంత కదలిక వచ్చినా.. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పూర్వ వైభవం మాత్రం రావడం లేదు. భూములు, ఇంటి స్థలాల ధరలు అడ్డగోలుగా పెరిగిపోవడంతో కొనుగోళ్లకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా కామారెడ్డి పట్టణంతో పాటు పట్టణ పరిధిలోని ఇల్చిపూర్, అడ్లూర్, దేవునిపల్లి, లింగాపూర్, టేక్రియాల్, సరంపల్లి, పాతరాజంపేట, రామేశ్వర్‌పల్లి తదితర ప్రాంతాల్లో ప్లాట్ల క్రయ విక్రయాలలో స్తబ్దత నెలకొంది.



గజానికి రూ. 10 వేలపైనే..

కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోనూ భూముల ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు ప్లాట్లు కొనలేకపోతున్నారు. జిల్లాకేంద్రంలోని పలు కాలనీలలో గజానికి రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ధర పలుకుతోంది. వంద గజాల ప్లాటు కొనాలంటే రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి.. పట్టణానికి దూరంగా ఉన్న వెంచర్లలో కూడా గజానికి తక్కువలో తక్కువ రూ.10 వేల వరకు పలుకుతుంది. అంతమొత్తం వెచ్చించి సామాన్యులు ప్లాటు కొనే పరిస్థితి లేదు. దీంతో చాలామంది అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నారు. మరోవైపు రియల్ వ్యాపారం పడిపోవడంతో వ్యాపారులు, మధ్యవర్తులు కూడా ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన భూముల ధరలు తగ్గే అవకాశాలు లేకపోవడం, ప్రస్తుతం ఉన్న ధరలతో అమ్మకాలు సాగకపోవడంతో వ్యాపారులతోపాటు మధ్యవర్తిత్వం ద్వారా జీవనం సాగిస్తున్న చాలామంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

సగానికి తగ్గిన రిజిస్ట్రేషన్లు..

కామారెడ్డి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గతంలో రోజూ నలభై నుంచి యాభై వరకు డాక్యుమెంట్లు అయ్యేవి. రిజిస్ట్రేషన్ రుసుము ద్వారా నెలకు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే కరోనా మూలంగా తగ్గుతూ వచ్చిన రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ పుంజుకోవడం లేదు. రెండు మూడేళ్లుగా రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయి. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి గతేడాది జూలైలో రూ.29.16 లక్షల ఆదాయం రాగా.. ఆగస్టులో రూ. 22.88 లక్షలు, సెప్టెంబర్‌లో రూ. 21.04 లక్షలు, అక్టోబర్‌లో రూ. 18.87 లక్షలు, నవంబర్‌లో రూ.17.78 లక్షలు, డిసెంబర్‌లో రూ. 22.70 లక్షల ఆదాయం వచ్చిందని రిజిస్ట్రేషన్ లెక్కలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ల కోసం గతంలో కార్యాలయం వద్ద బారులు తీరేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది.

‘ఉల్లంఘను’లపై కొరడా

- అనుమతులకు మించి కంకర తవ్వకాలపై చర్యలు షురూ
- ఆర్మూర్‌లోని క్వారీకి రూ.41 కోట్ల జరిమానా
- కామారెడ్డి జిల్లా ఇసాయిపేట క్వారీకి రూ.53 కోట్లు..



ఆర్మూర్ శివారులో రూ.41కోట్ల జరిమానా విధించబడి, ప్రస్తుతం మూసేసి ఉన్న క్వారీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ప్రభుత్వం మారడంతో ఒక్కొక్క విభాగానికి సంబంధించి అక్రమార్కులపై యంత్రాంగం వరుసగా కొరడా ఝుళిపించే కార్యక్రమం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజే ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి వ్యవహారాలకు సంబంధించి ఆయా విభాగాల అధికారులు రంగంలోకి దిగి చర్యలకు పూనుకున్నారు. తాజాగా ఆర్మూర్ పట్టణ శివారులో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కనుసన్నల్లో తీసుకున్న అనుమతులకు మించి కంకర తవ్వకాలు చేసిన విషయాన్ని గనుల శాఖ ఉన్నతాధికారులు నిర్ధారించారు. 3.6 హెక్టార్లకు అనుమతులు తీసుకుని అందుకు 95 శాతం అదనంగా తవ్వకాలు చేసినట్లు అధికార యంత్రాంగం తేల్చింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డిని కాదని అధికారులు ఏమీ చేయలేకపోయారు. అయితే ప్రస్తుతం అధికారం మారడంతో గనుల శాఖ అధికారులు తీసుకున్న అనుమతుల మేరకు కాకుండా అనేక రెట్లు తవ్వకాలు చేయడంతో సదరు ఉల్లంఘనలపై జరిమానా విధించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను ప్రవీణ్‌రెడ్డి పేరిట ఉన్న ఈ క్వారీకి సంబంధించి రూ.41 కోట్ల జరిమానా విధించారు. ఈ విషయాన్ని నిజామాబాద్ మైనింగ్ ఏడీ సత్యనారాయణ ధ్రువీకరించారు. ప్రస్తుతం ఈ క్వారీని నడపడం లేదు.

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఇస్సాయిపేట వద్ద శ్రీనివాస స్టోన్ ఇండస్ట్రీస్ క్వారీకి గనుల శాఖ రూ.53 కోట్ల జరిమానా విధించింది. తీసుకున్న అనుమతులకు మించి చుట్టుపక్కల ప్రాంతాలను భారీగా ఆక్రమించి తవ్వకాలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. పాత బకాయిలు రూ.21 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ఈ క్వారీకి సంబంధించిన నైనిత కన్‌స్ట్రక్షన్ స్టోన్ క్రషర్‌కు రూ.34 లక్షలు జరిమానా విధించారు. ఈ విషయాలను మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ ధ్రువీకరించారు. ప్రస్తుతం దీని తవ్వకాలు నిలిపేశారు. అయితే ఈ క్వారీలో పేలుళ్ల కారణంగా తమ ఇళ్లు నెర్రెలు బారి దెబ్బతిన్నాయని గ్రామస్తులు డిసెంబర్ 26న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం మారిన తరువాత మాత్రమే అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించడం బట్టి గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు చెబుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదాయాన్ని జనరేట్ చేసేదాంట్లో భాగంగా అధికార యంత్రాంగం వరుసగా ఒక్కో అక్రమంపై, ఉల్లంఘనలపై చర్యలకు దిగడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం దృష్టి పెడితే మరిన్ని అక్రమ వ్యవహారాలు, ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు పెరుగుతాయని పలువురు అంటున్నారు.







కాంగ్రెస్‌లో ముగ్గురు కౌన్సిలర్ల చేరిక



షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో కండువాలు మారుతూనే ఉన్నాయి. తాజాగా మరో ముగ్గురు కౌన్సిలర్లు కారు దిగి హస్తం గూటికి చేరారు. 3, 6, 7 వార్డుల కౌన్సిలర్లు పొదర్ల రాజు, ఆకుల స్వరూప, భూక్యా రాజు బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత, ఆమె భర్త రవి ఆధ్వర్యంలో చేరికలు సాగుతున్నాయి. 49 మంది సభ్యులున్న కామారెడ్డి బల్దియాలో ప్రస్తుత చేరికలతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 22కు చేరింది. మరో ముగ్గురు చేరితే ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే అవకాశాలున్నాయి.

ఆర్టీసీ కార్గోలో సమ్మక్క సారక్క ప్రసాదం

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ కార్గో సేవల ద్వారా సమ్మక్క సారక్క బంగారం(బెల్లం ప్రసాదం) అందజేయనున్నట్లు ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లలో ఉన్న కార్గోలలో రూ. 299 చెల్లించి బుక్ చేసుకుంటే ఇంటి వద్దకే ప్రసాదం డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. సమ్మక్క సారక్క జాతరకు వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 91542 98730 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

విధులు సక్రమంగా నిర్వహించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ప్రతిఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో భుజంగరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో భుజంగరావు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల పెట్టెతో అవినీతికి చెక్



భిక్కనూరు : కామారెడ్డి ఎమ్మెల్యే ప్రవేశపెట్టిన పిర్యాదుల పెట్టెతో అవినీతికి చెక్ పెట్టవచ్చని తిప్పాపూర్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు ఏలేటి గణేశ్‌రెడ్డి అన్నారు.బుధవారం గ్రామంలో పిర్యాదుల పెట్టెను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదుల పెట్టెలో లిఖిత పూర్వకంగా రాసిస్తే ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి వాటిని పరిష్కరింప జేస్తారన్నారు. బీజేపీ ఉపాధ్యక్షుడు తాటిపల్లి వెంకట్. కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి బస్వరెడ్డి, నేతలు భాస్కర్ యాదవ్, నర్సరెడ్డి,వెంకట్,ప్రవీన్,మల్లేషులు పాల్గొన్నారు.

రామేశ్వర్‌పల్లిలో నీటిఎద్దడి



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లిలో పలు వార్డుల్లో నీటిఎద్దడి నెలకొంది. నాలుగు రోజులు మంచినీటి కులాయిల్లో 1, 3, 4 వార్డుల్లోని పలు వీధులతో పాటు ఊరడమ్మ వద్ద ఉన్న ఇళ్లకు మంచినీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీపీ అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే అందుబాటులో లేరని వారు వాపోతున్నారు.

రామేశ్వరాలయంలో ఆర్డీవో పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్‌లోని త్రిలింగ రామేశ్వరాలయంలో బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. ఆలయకమిటీ చైర్మన్ దత్తు ఉన్నారు.

ఇద్దరు లైన్‌మన్‌ల సస్పెన్షన్

నందిపేట్(ఆర్మూర్): మండలంలో విద్యుత్ శాఖ విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు లైన్‌మన్‌లు సస్పెన్షన్‌కు గురయ్యారు. సిహెచ్ కొండూర్ లైన్‌మన్ నవీన్, కుద్వాన్‌పూర్ చెందిన వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లు



మెంగారంలో పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి



రాఘవపల్లిలో వరిని పరిశీలిస్తున్న ఏవో విజయశేఖర్

- పంటలను పరిశీలిస్తున్న అధికారులు
- రైతులకు సూచనలు, సలహాలు

లింగంపేట(ఎల్లారెడ్డి) : వరి పంటలో తెగుళ్ల నివారణకు జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బుధవారం ఆమె లింగంపేట మండలం మెంగారం, లింగంపేట గ్రామ శివారులో వరి పంటలను పరిశీలించారు. మోగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున నివారణ కోసం క్లోరోఫైరిఫాస్ అనే మందును ఎకరాకు 500 మి.మీ లేదా కార్టాప్ హైడ్రా క్లోరైడ్ 4జీ గులికలు ఎకరాకు 8 కిలోలు లేదా కార్టాప్ హైడ్రా క్లోరైడ్ 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు లక్షణాలు కనిపించినట్లు తెలిపారు. నివారణ కోసం ప్లాంటమైసిన్ 50 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏఈవోలు మధుసూదన్, రైతులు దాసరి పర్వయ్య, తంత్రి హన్మంతు, కుంట రాజు తదితరులు ఉన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న వరిపంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట మండల ఏవో విజయశేఖర్ సూచించారు. నాగిరెడ్డిపేటలోని రాఘవపల్లిలో రైతులు సాగుచేస్తున్న వరిపంటను బుధవారం పరిశీలించారు. కాండం తొలుచు పురుగు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యల గురించి రైతులకు ఆయన వివరించారు. పురుగు నివారణ కోసం 200లీటర్ల నీటిలో 400గ్రాముల హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ మందును కలిపి ఎకరం పంటపై పిచికారి చేయాలన్నారు. లేదా 200లీటర్ల నీటిలో 60మిల్లీలీటర్ల కోరంట్రానిలిప్రోలును కలిపి ఎకరం పంటపై పిచికారి చేయాలన్నారు. ఆయనవెంట మాజీసర్పంచ్ వుంకట్రాం రెడ్డితోపాటు పలువురు రైతులున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి



దోమకొండ మండలం సీతారాంపల్లి కేజీబీవీలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్

దోమకొండ : ఉపాధ్యాయులు సమన్వయంతో విధులు నిర్వహించి విద్యార్థులకు మంచి మార్కులు వచ్చేలా కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. మండలంలోని సీతారంపల్లి గ్రామంలో గల కస్తూర్బాగాంధీ పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పాఠశాల పీఈటీ వీణ ఇటీవల ప్రిన్సిపల్ మమతపై చేసిన ఆరోపణలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల మధ్య మనస్పర్థలు లేకుండా ఉండాలన్నారు. అనంతరం డీఈవో రాజుతో ఫోన్‌లో మాట్లాడారు. సర్పంచ్ జాలిగాం నాంపల్లి, పాఠశాల ప్రిన్సిపల్ మమత, ఉపాధ్యాయులు ఉన్నారు.

సుద్దముక్కపై సేవాలాల్



బాన్సువాడ రూరల్ : మండలంలోని పోచారం తండాకు చెందిన సరిచంద్ మైక్రోఆర్ట్‌పై ఆసక్తి కనబరుస్తున్నాడు. జాతీయ చిహ్నాలు, జాతీయ నాయకులు చిత్రాలను సబ్బుబిల్ల, చాక్‌పీస్, పెన్సిల్‌లెడ్‌పై చెక్కుతూ పలువురిని ఆకట్టుకుంటున్నాడు.తాజాగా ఫిబ్రవరి 15న గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి పురస్కరించుకుని సరిచంద్ సుద్దముక్కపై శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రాన్ని గీశాడు.యువకుడిని గ్రామస్తులు అభినందించారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి



మాట్లాడుతున్న బంజారా గిరిజన నాయకులు

కామారెడ్డి టౌన్ : బంజారుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా 15వ తేదీన సెలవు దినంగా ప్రకటించాలని కామారెడ్డి జిల్లా బంజారా, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. బుదవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డిలోని టేక్రియాల్ బైపాస్ రోడ్డు పక్కన ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిన భూమిలో నేడు పెద్ద ఎత్తున జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గణేష్‌నాయక్ తదితరులున్నారు.

పంచముఖి ఆలయంలో చోరీకి యత్నం

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని పంచుముఖీ హనుమాన్ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆలయంలో ఎలాంటి విలువైన వస్తువులు, ఆభరణాలు, డబ్బు పోలేదని తెలిపారు. కేసు నమోదు చేసి సీసీ కెమరాల ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో మొదటి స్థానం

- కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేయడంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని ఎస్పీ సింధుశర్మ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఈఐఆర్ అప్లికేషన్ వచ్చిన తర్వాత ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,053 మొబైల్ ఫోన్ లను రికవరీ చేశామన్నారు. బాన్సువాడ సబ్ డివిజన్ పరిధిలో 442, కామారెడ్డి పరిధిలో 398, ఎల్లారెడ్డి పరిధిలో 213 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని తెలిపారు. మొబైల్ ఫోన్‌ల రికవరీలో బాన్సువడ పీఎస్ మెదటి, కామారెడ్డి పీఎస్ ద్వితీయ స్థానాల్లో ఉన్నయని వెల్లడించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసులను సంప్రదించి సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో విశేషంగా కృషి చేస్తున్న సిబ్బందిని అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులోని జాతీయ రహదారి 44పై ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన బండారు శ్రీను(52) కొన్నేళ్ల క్రితం జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు వచ్చి స్థిరపడ్డాడు. గ్రామంలోనే ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం నిర్మల్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు భార్యతో కలిసి బైక్‌పై బయల్దేరి వెళ్లాడు. ఆర్మూర్‌లో భార్యను బస్సులో ఎక్కించి ఆయన బైక్‌పై వెళ్లాడు. ఈక్రమంలో వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై అతడి బైక్ రేలింగ్‌కు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ట్లు ముప్కాల్ ఎస్సై భాస్కరచారి తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ..



పోశవ్వ (ఫైల్)

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన ఉపాధి హామీ మహిళా కూలీ బుధవారం ఉపాధి పనులు చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందింది. గ్రామానికి చెందిన పాగోంటి పోశవ్వ(54) ఎల్లమ్మ చెరువు కాలువ పనులు చేయడానికి వెళ్లింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని తోటి మహిళా కూలీలకు తెలిపింది. వెంటనే వారు దోమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతురాలికి భర్త స్వామి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గ్రామస్తులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు. ఉపాధి హామీ పనుల వద్ద ఎలాంటి వైద్య సదుపాయాలు లేవని గ్రామస్తులు ఆరోపించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట గల ఉన్న చికెన్ సెంటర్ వద్ద బుధవారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి ఎస్సై నీరేష్ వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడు కడపకు చెందినవాడని అతను కాస్మెటిక్స్ అమ్ముకోవడానికి ఇటువైపు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

- అవయవ దానానికి ముందుకు వచ్చిన కుటుంబం



కార్తీక్ (ఫైల్)



సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ కానిస్టేబుల్, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గడీ రోడ్డులో నివాసం ఉండే బెజ్జంకి కార్తీక్ (33) డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతడు బైక్‌పై వెళుతుండగా దేవునిపల్లి వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతనికి భార్య సంజన, కుమార్తె వామిక, తల్లిదండ్రులు ఉన్నారు. పుట్టెడు దు:ఖంలోనూ కార్తీక్ కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో అవయవ దానానికి ముందుకు వచ్చారు. వారి అనుమతితో ఆస్పత్రి సిబ్బంది అతని అవయవాలను సేకరించారు. అవయవ దానంతో తాను చనిపోతూనే మరో నలుగురికి జీవితాల్లో వెలుగులు నింపాడు కార్తీక్. కార్తీక్ అంత్యక్రియలు కామారెడ్డిలో బుధవారం సాయంత్రం జరిగాయి.

బాన్సువాడ మండలంలో ఒకరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన సంగెం సత్యనారాయణరెడ్డి (48) ఈనెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం పొలానికి నీళ్లు పెట్టి ఇంటికి తిరిగి వస్తుండగా దత్తాత్రేయ మందిరం సమీపంలోని అతడి బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

బాన్సువాడలో మరొకరు..

బాన్సువాడ రూరల్: పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో నివాసముండే తాపీమేస్త్రీ తగిలేపల్లి పోశెట్టి(50) మంగళవారం యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం పోశెట్టి ఓ ప్రమాదానికి గురై, గాయపడ్డాడు. అప్పటినుంచి అతడు మంచానికే పరిమితం కావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో ఇటీవల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అమర జవాన్లకు ఘననివాళి



భిక్కనూరులో అమర జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు



పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న యువకులు

భిక్కనూరు : పుల్వామాలో అమరులైన జవాన్ల ఆత్మశాంతి కోసం భిక్కనూరు మండల కేంద్రంలో సిద్దరామేశ్వర ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ట్రాలీ ఆటోల ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఎస్సై సాయికుమార్ ప్రారంభించారు. చౌరస్తా వద్ద ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. సిద్దరామేశ్వర ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షుడు బండి సత్యం, కోశాధికారి బాలకుమార్ ఉన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్) :2019 ఫిబ్రవరి 14న పుల్వామా పేలుడులో మృతి చెందిన ఆర్మీ జవాన్ల ఆత్మకు శాంతి చేకురాలని మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో బుధవారం యువకులు నివాళులు అర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

స్పెల్ విజార్డ్ పోటీలో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని నీల పావని

గాంధారి(ఎల్లారెడ్డి) : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇంగ్లిష్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్ పోటీల్లో గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నీల పావని ప్రథమ బహుమతి పొందినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్ బుధవారం తెలిపారు. ఎల్టా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, నాటక పోటీ జరిగిందని, స్పెల్‌విజార్డ్‌లో పావని ప్రతిభ చూపిందన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



బీర్కూర్ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో షేక్ సలాం

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం జరిగిన పరీక్షకు 536 విద్యార్థులకు గాను 519 హాజరుకాగా, 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 118 విద్యార్థులకు గాను 113 హాజరుకాగా, ఐదుగురు గైర్హాజయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు తాడ్వాయి, బీర్కూర్ మండలాల్లోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్ అధికారి షేక్ సలాం, జిల్లా ఎగ్జామినేషన్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌లు తనిఖీలు చేశారు.

సొసైటీ బహిష్కరణపై ఫిర్యాదు



సీపీ కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు

ఖలీల్‌వాడి: కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గీతా పారిశ్రామిక సహకార సంఘం(సొసైటీ)లో ఉన్న ఇతర కులాలకు చెందిన గీతాకార్మికులను గౌడ కులస్తులు బహిష్కరించినట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు బుధవారం సుమారు 40 మంది బాధితులు సీపీ కార్యాలయానికి తరలివచ్చి, ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సహకార సంఘంలో 111 మంది సభ్యులు ఉంటే, మెజార్టీలో ఉన్న గౌడ గీతా కార్మికులు ఇతర కులాలకు చెందిన గీతాకార్మికులు ఉండవద్దని చెబుతున్నారన్నారు. తాము గీత వృత్తికి వెళ్లితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన గీతాకార్మికులను ఈత వనాల వద్దకు రానివ్వడం లేదని, కొంత మంది దూషించినట్లు పేర్కొన్నారు. దీనిపై కమ్మర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



బోర్లంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణ



దోమకొండలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్ : శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని బాన్సువాడ పట్టణ నూతన సీఐ కృష్ణ కోరారు. బుధవారం ఆయన మండలంలోని బోర్లం గ్రామం గాంధీచౌక్‌లో గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. నూతన సీఐ కృష్ణను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, పుట్టి లక్ష్మణ్, మమ్మాయి కాశీరాం తదితరులున్నారు.

డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

దోమకొండ : మండల కేంద్రంలో బుధవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేసి డ్రంకన్ డ్రైవ్ టెస్టులు చేశారు. డ్రంకన్‌డ్రైవ్‌లో 2 కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. కానిస్టేబుళ్లు సంజీవ్‌కుమార్, ఎల్లయ్య, స్వామి తదితరులు ఉన్నారు.



బీబీపేటలో కార్‌కు స్టిక్కర్‌ను తొలగిస్తున్న పోలీసు

బీబీపేట : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కార్లకు నల్ల స్టిక్కర్లను తొలగించారు. హెల్మెట్ లేని బైక్ యజమానులకు జరిమానాలు విధించారు. సిబ్బంది రాంలు, సిబ్బంది అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి కేసులో కొనసాగుతున్న విచారణ

రామారెడ్డి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని భారతి (15) ఆకస్మిక మరణం మిస్టరీగా మారింది. ఈనెల 8న తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లి, తిరిగి వచ్చేసరికి భారతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న స్థితిలో ఉంది. స్కూల్‌కు వెళ్లమని మందలించినందుకు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుందని తండ్రి సాంబ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని భారతిది ఆత్మహత్య కాదనీ, ఖచ్చితంగా హత్యేనని అనుమానం వ్యక్తం చేశారు. ఆమెను తండ్రి, కుటుంబ సభ్యులు కలిసే హత్య చేశారని ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి ఎందుకు తీసుకురాలేదని, గుర్తుతెలియని ప్రాంతంలో ఎవరి కీ చెప్పకుండా అంత్యక్రియలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని కోణాల్లో విచారణ జరపాలని ఎస్సై కొండా విజయ్‌కి ఫిర్యాదు చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, బాగా చదువు కుని ఉన్నత స్థానంలో ఉంటానని చెప్తూ ఉండేదని తోటి విద్యార్థులు చెబుతున్నారు. దీంతో భారతి మృతిపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కేసులో ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నామని ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి గల కారణాలు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. అసలు ఏం జరిగి ఉంటుందనే సందేహాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. కేసు ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

'ఆన్‌లైన్ ఉద్యోగాల మోసం'పై కేసు నమోదు!

ఖలీల్‌వాడి: ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన ఇద్దరితోపాటు మరికొంత మందిపై పోలీసులు కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీ వద్ద ఉన్న ఓ గొలుసుకట్టు ఆన్‌లైన్ సంస్థలో రూ. 45వేలు చెల్లిస్తే ప్రతి నెల ఆన్‌లైన్ ద్వారా ఆదాయం వస్తుందని యువతకు నిర్వాహకులు నమ్మబలికారు. దీంతో తెలంగాణతోపాటు ఆంధ్రప్రాంతంకు చెందిన వారిని నిజామాబాద్‌లో ఆఫీస్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో వివిధ వస్తువులకు సంబంధించిన ఐదు ప్రొడక్ట్‌లను ఎంట్రీ చేయాలని సూచించినట్లు తెలిసింది. దీంతో ప్రతి నెల రూ. 20వేల నుంచి రూ. 30వేల వరకు ఆదాయం వస్తుందని నమ్మబలికారు. డిగ్రీ చేసిన పలువురు ఈ ఆన్‌లైన్ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగంలో చేరిన వారు ఎవరినైనా ఆన్‌లైన్ ఉద్యోగంలో చేర్పిస్తే వారికి అదనంగా రూ.11వేలు చెల్లిస్తామని నమ్మబలికారు. ఇటీవల మంచిర్యాలకు చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో చేరారు. ప్రతి నెల రావాల్సిన వేతనం రాకపోవడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దీనిపై సౌత్ సీఐ సురేష్, నిజామాబాద్ ఎస్సై మహేష్ విచారణ ప్రారంభించారు. ఇందులో ఇద్దరిపై కేసులు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు.